# శ్రీ తంగి సత్యనారాయణ

శ్రీ తంగి సత్యనారాయణ ఏడవ శాసనసభ (1983-1984) స్పీకరుగా 1983వ సంవత్సరం జనవరి 18వ తేదీన ఏకగ్రీవంగా ఎన్నికై 1984వ సంవత్సరం ఆగస్టు 28వ తేదీ వరకు ఆ పదవిని నిర్వహించారు.

వీరు 1931వ సంవత్సరము సెప్టెంబరు 8వ తేదీన శ్రీకాకుళం జిల్లా కిల్లిపాలెంలో జన్మించారు. విశాఖపట్నంలోని ఎ.వి.ఎల్. కాలేజీ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన తరువాత ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి బి.ఎల్. డిగ్రీలో పట్టభద్రులైనారు.

వీరు 1958వ సంవత్సరములో కిల్లిపాలెం గ్రామ పంచాయతీకి సర్పంచ్‌గా పనిచేశారు. 1962వ సంవత్సరములో శ్రీకాకుళం జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ ఛైర్మన్‌గా పనిచేశారు. వీరు శ్రీకాకుళం వ్యవసాయ అభివృద్ధి బ్యాంకు అధ్యక్షులుగా 1975 నుండి 1978 వరకు పనిచేశారు. 1975-1978 సంవత్సరాలలో ఎ.పి. స్టేట్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పనిచేశారు. 1982వ సంవత్సరములో శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా పనిచేశారు.

శ్రీ సత్యనారాయణ 1967వ సంవత్సరము నాల్గవ శాసనసభకు, 1983వ సంవత్సరము ఏడవ శాసనసభకు శ్రీకాకుళం నియోజకవర్గం నుండి ఎన్నికైనారు.

వీరు శ్రీ నాదెండ్ల భాస్కరరావు మంత్రివర్గంలో 1984వ సంవత్సరము ఆగస్టు 28 నుండి 1984వ సంవత్సరము సెప్టెంబరు 15 వరకు రెవిన్యూ, భూసంస్కరణలు, రిజిస్ట్రేషన్ స్టాంపులు, జాగీర్ అడ్మినిస్ట్రేషన్, స్వాతంత్ర్య సమరయోధుల సంక్షేమం, సహాయ పునరావాసం, సర్వే సెటిల్‌మెంట్స్, ముఖ్యమంత్రి సహాయనిధి శాఖ మంత్రిగా పనిచేశారు.

శాసనసభలో జరిగిన చర్చలు ప్రజలకు యథాతథంగా చేరాలని శ్రీ తంగి సత్యనారాయణ అభిలషించేవారు. ప్రచార సాధనాలు ముఖ్యంగా వార్తా పత్రికలు రాజకీయ పరమైన, వ్యక్తిగతమైన రాగద్వేషాలకు అతీతంగా వ్యవహరిస్తూ సభాకార్యక్రమాలను నిష్పక్షపాతంగా ప్రజలకు అందించాలని వీరు 1983, సెప్టెంబరు 19వ తేదీన ఇచ్చిన రూలింగులో స్పష్టం చేశారు.

శ్రీ తంగి సత్యనారాయణ స్పీకరుగా శాసనసభ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించారు.

## శ్రీ తంగి సత్యనారాయణ స్పీకర్‌గా ఎన్నికైన సందర్భంగా చేసిన ప్రసంగం

స్నేహితులారా, ఈ ఏడవ శాసనసభ సభాధ్యక్షుడిగా నన్ను ఏకగ్రీవముగా ఎన్నుకొన్నందుకు గౌరవనీయులైన ముఖ్యమంత్రిగారికి, ప్రతిపక్షనాయకులకు, గౌరవ సభ్యులందరకూ నా హృదయపూర్వక ధన్యవాదములు. నేను వినమ్రతతో, పవిత్ర హృదయముతో త్రికరణశుద్ధిగా ఈ బాధ్యతలను స్వీకరిస్తున్నాను. అనేక మంది మిత్రులు, విజ్ఞులు, ప్రాజ్ఞులు, చాలా సలహాలు, సూచనలు చేశారు. వాటన్నింటిని దృష్టిలో పెట్టుకొని సభాకార్యక్రమాలను నిర్వహిస్తాను అని సభ్యులకు హామీ యిస్తున్నాను. ప్రతిపక్షము, పాలకపక్షము అనే భేదము లేకుండా న్యాయము కలిగే పద్ధతిలో అందరికీ రక్షణ కల్పిస్తాను అని మనవిచేస్తున్నాను. నేను ఈ సభా కార్యక్రమాలను నిర్వహించటములో సభ్యులందరు తమ సహకారాన్ని యివ్వాలని మనవిచేస్తున్నాను. సభాకాలము చాలా అమూల్యమైనది. అనేక సమస్యలుంటాయి. మనకు వున్న సమయములో ఈ సమస్యలను ప్రభుత్వదృష్టికి తీసుకొనిరావడానికి వినియోగించుకోవడము మంచిదని భావిస్తున్నాను. ఆంధ్రుల అభ్యున్నతికి కృషి చేయాలని లక్ష్యములో ఎటువంటి సందేహము లేదు. ఏ పార్టీ వారైనా కాని వారి ప్రోగ్రామ్స్ ఏవైనా కాని లక్ష్యం ఒకటే. ఆంధ్రుల అభ్యున్నతికి అంకితము కావాలనే దృష్టితో వ్యవహరించాలని, ఆవేశాలకు తావు యివ్వక శాంతియుతమైన వాతావరణములో చర్చలు జరుపుకొని సమస్యలను పరిష్కరించుకొనడానికి ప్రయత్నము చేద్దాము. సభ్యులందరూ ఈ శాసనసభలో హుందాగా వ్యవహరిస్తారని ఆశిస్తున్నాను. సభ హుందాతనాన్ని కాపాడటానికి నేను ప్రయత్నము చేస్తాను. ఆంధ్రప్రదేశ్ విధానసభకు ఒక ప్రత్యేకత వుందని గౌరవనీయులైన అనేకమంది పెద్దలు చెప్పివున్నారు. హుందాతనముగా ఇంతకుముందున్న సభాధ్యక్షులు సభా కార్యక్రమాలను నిర్వహించిన మాదిరే నేను కూడ సభ హుందాతనమును మెయింటెయిన్ చేస్తానని మనవి చేస్తున్నాను. శాసన సభ్యులు కూడ తమ విధ్యుక్త ధర్మాన్ని నిర్వహిస్తే సభా కార్యక్రమాలు సాఫీగా సాగుతాయి, ధర్మో రక్షతి రక్షిత: ఏ ధర్మము రక్షించబడుతుందో అదే ధర్మము మనలను రక్షిస్తుంది. శాసన సభ్యులు తమ తమ విధ్యుక్త ధర్మమును నిర్వహించిననాడు అదే ధర్మము మనందరను రక్షిస్తుందని తెలియజేస్తూ మీ అందరకు నా ధన్యవాదాలు మరొకసారి తెలియజేస్తూ శలవు తీసుకుంటున్నాను.